క్లుప్తంగా

నేడు ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం

పెద్దేముల్: నియోజకవర్గ ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు వీరప్ప, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నర్సింలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు కందనెల్లి శివారులోని జీపీఆర్ ఫంక్షన్‌లో నిర్వహించే ఈ సమావేశానికి ముదిరాజ్ కులస్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లీజులు లేకుంటే క్రిమినల్ కేసులు

వ్యాపారులను హెచ్చరించిన మైన్స్, రెవెన్యూ అధికారులు



తనిఖీలు చేపడుతున్న అధికారులు

బషీరాబాద్: మండల పరిధిలోని జీవన్గీలో అక్రమంగా తవ్వుతున్న గనులపై పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. శనివారం జీవన్గీ గనుల్లో మైన్స్ ఆర్ఐ నాగలక్ష్మి, రెవెన్యూ ఆర్ఐ రాకేశ్, సర్వేయర్ ప్రభుకుమార్ తదితరులు దాడులు చేశారు. ఎవరైనా లీజులు లేకుండా తవ్వకాలు చేపడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. నాపరాయిని అక్రమంగా రవాణా చేస్తే లారీలు సీజ్ చేస్తామన్నారు.

కార్యకర్తలను ఆదుకుంటాం

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్

కుల్కచర్ల: బీజేపీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేలలా అండగా ఉంటామని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు సంతోశ్‌గౌడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మారుతికిరణ్ శనివారం సంతోశ్‌గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మైపాల్ ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ

కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం



ఆహ్వానపత్రం అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

తాండూరు టౌన్: వీరుడు, తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు కురుమ కులస్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందం, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం వారు ఈ నెల 3న నిర్వహించనున్న విగ్రహావిష్కరణకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను తాండూరు కురుమ సంఘం సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, గోపాల్, రాపోలు నర్సింహులు, పాండు, మల్లేషం, వెంకటయ్య, బాలు, నర్సింలు, బాలప్ప, రాము, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలి



అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు

బొంరాస్‌పేట: చెత్త సేకరణ దారులకు తడి, పొడి చెత్త వేర్వేరుగా అందజేయాలని చౌదర్‌పల్లి సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీటీసీ సభ్యుడు శేరి నారాయణరెడ్డి గ్రామస్తులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం లోపిస్తే ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

శనైశ్చర స్వామికి తైలాభిషేకం

మోమిన్‌పేట: శనిత్రయోదశి సందర్భంగా మండల పరిధిలోని ఏన్కతలలో శనైశ్చరస్వామికి భక్తులు నువ్వుల నూనెతో తైలాభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు స్వామి వారి దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామి వారికి ప్రీతియైన నల్లని దుస్తులు, నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహించారు. సప్తవృక్షాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఆయన వెంట ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘సాగు’ ఎలా?



విత్తనాలు వేస్తున్న రైతులు

ఒకప్పుడు పండగలా సాగిన వ్యవసాయం నేడు ఇబ్బందులు పాలవుతోంది. వానాకాలం సాగుకు వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసినా.. అన్నదాతలకు సలహాలు, సూచనలు అందిచాల్సిన వ్యవసాయాధికారులు రైతుబంధు నమోదు ప్రక్రియలో బిజీగా ఉన్నారు. దీంతో చేసేది లేక పురుగు మందు దుకాణదారులు చెప్పిన మందులే వాడి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

- అన్నదాతకు కరువైన సలహాలు, సూచనలు
- రైతు వేదికలకే పరిమితమైన వ్యవసాయాధికారులు
- పురుగు మందుల దుకాణదారులను ఆశ్రయిస్తున్న రైతులు

పరిగి: రైతులు సాగు చేసే పంటలకు మెలకవులతో పాటుగా వాటికి సోకిన వ్యాధులను గుర్తించి సహాలు, సూచనలు అందించాల్సిన వ్యవసాయాధికారులు, విస్తరణ అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతీ క్లస్టర్‌కు ఓ రైతువేదిక ఏర్పాటు చేసింది. కానీ అధికారులు మాత్రం రైతు వేదికలకే పరిమితమవుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఏ పంటకు ఎప్పుడు ఏ మందు వాడాలో తెలియక నష్టపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసేదేమి లేక పురుగు మందు దుకాణదారులు చెప్పిన మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో పంట పెట్టుబడులు పెరిగి అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాలకు వలస

రైతులకు పంట సాగులో అవగాహన కల్పించి సాగు పద్ధతిలో మార్పు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ క్లస్టర్‌కు ఒక ఏఈఓను నియమించింది. సీఎం కేసీఆర్ ఆశించిన స్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎరువుల దుకాణాలకు, పురుగు మందుల దుకాణాలకు పెట్టుబడిగా పెట్టి పంటలో నష్టం రావడంతో అన్నదాతలు పట్టణాలకు వలసలు వెళ్తున్నారు.

అంచనాలు సరే.. ఆచరణ ఎక్కడ?

నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 22 క్లస్టర్లల్లో 22 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. వానాకాలం నియోజకవర్గ వ్యాప్తంగా 90వేల ఎకరాలకు పైగా రైతులు పంట సాగు చేయనున్నట్టు అధికారులు అంచనా వేశారు. ఎక్కువగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేశారు. రైతులు పంట సాగు చేసేముందు, చేసిన తరువాత సలహాలు, సూచనలు అందించాల్సిన వ్యవసాయ అధికారులు కార్యాలయానికే పరిమితమవ్వడంతో ఇబ్బంది పడుతున్నారు.

అధికారులు రావట్లే



మూడు ఎకరాల్లో మొక్కజొన్న, కంది విత్తేందుకు అంతా సిద్ధం చేశా. వ్యవసాయ అధికారులు మాత్రం గ్రామాల్లోకి వచ్చి పంట సాగుకు ఎలాంటి సలహాలు, సూచనలు ఇవ్వడం లేదు. గతంలో పంటలకు రోగం వచ్చిందని మందుల దుకాణానికి వెళ్లి మందులు కొనుక్కున్నాం. వారు చెప్పిన మందులే వాడుతున్నాం.

– చంద్రయ్య, రైతు, పాలేపల్లి

రైతులకు అవగాహన కల్పిస్తాం

రైతుబంధు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఇది పూర్తైన వెంటనే ఏఈఓలు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచలను పాటించి ఆర్థికంగా బలోపేతం అవ్వాలి. ప్రతీ వారం రైతు వేదికల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.

– డీఎస్ లక్ష్మీకుమారి, ఏడీఏ, పరిగి

పరిశ్రమ ఏర్పాటుకు స్థల పరిశీలన

దౌల్తాబాద్: మండల పరిధిలోని చంద్రకల్‌లో పరిశ్రమ ఏర్పాటుకు ఇండస్ట్రీస్ జోనల్ మేనేజర్ రవికుమార్‌తో కలిసి ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. గ్రామ సమీపంలో 125 ఎకరాల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిశ్రమ ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉంటే స్థానిక ప్రజలు, గ్రామస్తులు, అధికారులతో మాట్లాడి భూ సమస్యలు పరిష్కరించి పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్, నాయకులు మహిపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, సర్పంచ్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

ఇసుక అక్రమ రవాణాకు అడ్డకట్ట వేయండి

బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్

తాండూరు టౌన్: డివిజన్ పరిధిలో విచ్చల విడిగా కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఇసుక ట్రాక్టర్ బీజేపీ కార్యకర్త భీమేశ్‌చారిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇప్పటి వరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై గాని, ఇసుక తరలిస్తున్న వ్యక్తులపైగాని అధికారులు ఎలాంటి చర్య తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీసు అధికారుల కనుసన్నల్లోనే అక్రమ దందా కొనసాగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకుంటే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

‘పట్నం’ చేరిక ప్రచారం మాత్రమే



మాట్లాడుతున్న రమేశ్‌మహరాజ్

ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్

తాండూరు: ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని డ్రామాలాడుతున్నాడని ఏఐసీసీ సభ్యుడు రమేశ్ మహరాజ్ విమర్శించారు. తాండూరులోని సిండికెట్ భవనంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పదిహేను రోజులుగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. కాంగ్రెస్‌ను అడ్డం పెట్టుకుని వారు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితే స్వాగతిస్తామని.. తాండూరు నుంచి పోటీలో మాత్రం నేనే ఉంటానన్నారు. మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి కొడంగల్ లేదా రాజేంద్రనగర్ అసెంబ్లీ స్థానం కేటాయించే యోచనలో పార్టీ అధిష్టానం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం పాటిస్తుందని చెప్పారు. కర్ణాటక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుందున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

పెద్దేముల్: పంచాయతీ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కార్మికులతో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు జీఓ–60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఈ నెల 6 నుంచి చేపట్టనున్న పంచాయతీ కార్మికుల సమ్మెలో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గోపాల్, రాజు, మండల అధ్యక్షుడు లింగేశ్, నూతన కమిటీ అధ్యక్షుడు అంబరయ్య, కార్యదర్శి శ్రీనివాస్, అనసూయ, బాలమణి, పద్మ, సంగప్ప, శ్రీనివాస్‌తో తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతులకు సకాలంలో రుణాలు



తట్టెపల్లిలో జెండాకు వందనం చేస్తున్న సహకార సంఘం సభ్యులు

సహకార సంఘం వైస్ చైర్మన్ అంజయ్య

పెద్దేముల్: రైతులకు రుణాలు అందించి సహకార సంఘాలు వారి అభ్యున్నతికి పాటుపడుతున్నామని తట్టెపల్లి వ్యవసాయ సహకారం సంఘం వైస్ చైర్మన్ అంజయ్య అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార సంఘం దినోత్సవం సందర్భంగా తట్టెపల్లి సహకార సంఘం కార్యాలయంలో సహకార జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా సీఈఓ రాజమౌలి, అంజయ్య మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. రైతులకు త్వరలోనే వానాకాలం రుణాలు అందజేస్తామన్నారు. ఎకరాకు రూ.50వేల చొప్పున ప్రతీ రైతుకు రూ.2లక్షల వరకు సాయం అందజేస్తామన్నారు. అవసరం ఉన్న రైతులకు ట్రాక్టర్ రుణాలు, పౌల్ట్రీ ఫాంకు బ్యాంకు నుంచి రుణాలు ఇస్తామన్నారు. గతేడాది రూ.45లక్షల వరకు ఎరువులు అందజేశామన్నారు. ఈ ఏడాది రూ.కోటి వరకు ఎరువులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సంఘం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, అంజప్ప, మల్లికార్జున్, సంజీవ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించండి



మొక్క నాటుతున్న విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. శనివారం పద్మశ్రీ వనజీవి రామయ్య జన్మదినం సందర్భంగా మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో జన్మించిన పద్మశ్రీ రామయ్య కోటి మొక్కలు నాటి పద్మశ్రీ అవార్డును అందుకున్నారని గుర్తుచేశారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం ఆమె పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వెంకట్, ప్రిన్సిపాల్ నాన్సీసోనికా, ఉపాధ్యాయులు జ్యోత్స్న, సువర్ణ, రూపారాణి, స్వరూప, కవిత, యాదమ్మ, ప్రతిభ, అనిత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే సంక్షేమ పథకాలు



దోమ: కొత్తపల్లిలో కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నాయకులు



కొడంగల్ రూరల్: టేకుల్‌కోడ్‌లో బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం

కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి

దోమ: కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని బీజేపీ నాయకుడు, కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని కొత్తపల్లిలో బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జి విస్తారక్ అరుసుతో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయ మన్నారు. తెలంగాణను బీఆర్‌ఎస్ పార్టీ అప్పుల రాష్ట్రంగా మార్చిందని ఆరోపించారు. నీళ్లు, నిధు లు, నియామకాలతో పేరిట అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మహాజన్ సంపర్క్ అభియాన్ మండల ఇన్‌చార్జి పెంటయ్య గుప్తా, బీజేపీ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, ప్రధానకార్యదర్శి బొంగు మల్లేశం, బీజేపీ నేతలు నర్సింలు, మణికంఠ, తిరుమలేశ్, మల్లేశ్, నందు, మాధవులు, శివ, శేఖర్, కృష్ణయ్య, శ్రీనివాస్, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీదే అధికారం

కొడంగల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు ఆకర్శితులవుతున్నారని.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి పట్టం కట్టడం ఖాయమని తమిళనాడుకు చెందిన తాత్కాలిక విస్తారక్ సింతల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని టేకుల్‌కోడ్‌లో పల్లె పల్లెకూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అనే నినాదంతో చేపట్టిన మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ తిరుగుతూ అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల కు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫల మైందన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను పక్క దారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శక్తికేంద్ర ఇన్‌చార్జి, న్యాయవాది బస్వరాజు, బీజే పీ సీనియర్ నాయకులు పున్నంచంద్ లాహోటి, జి ల్లా నాయకులు కె.చంద్రప్ప, బీజేవైఎం అసెంబ్లీ క న్వీనర్ సాయికుమార్, సర్వేశ్వర్, బూత్ ప్రెసి డెంట్ రాజేశ్వర్‌రెడ్డి, రాజేశ్‌గౌడ్, రామకృష్ణ, బూత్ అధ్యక్షుడు, మండల శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

మోమిన్‌పేట సీఐ బదిలీ

మోమిన్‌పేట: మోమిన్‌పేట సీఐ వెంకటేశం బదిలీపై వెళ్లారు. రెండేళ్ల ఏడు నెలల పాటు విధులు నిర్వహించిన ఆయన ఎక్కడ రాజీ పడకుండా పనిచేశారు. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ కమిటీకి బాధ్యత వహించి గంజాయి, నకిలీ విత్తనాలు, నకిలీ ఆహారపదార్థాలు, టీ పొడి తదితర తయారీదారులు, విక్రయదారులపై కేసులు నమోదు చేసి మన్ననలను పొందారు. సంగారెడ్డి రూరల్ సీఐ శివలింగయ్య మోమిన్‌పేటకు బదిలీపై రానున్నారు.

ధారూరు సీఐ అప్పయ్య..

ధారూరు: ధారూరు సీఐ అప్పయ్యను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన్ను డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ఎన్నికల నియమావళి ప్రకారం మూడేళ్లు పూర్తయిన సందర్భంగా అయన్ను బదిలీ చేశారు. సీఐ అప్పయ్య స్థానంలో ఎస్‌బీలో పనిచేస్తున్న రామకృష్ణను నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలయ్యేలా ఆదేశాలు అందాయి.

పేదలకు అండగా ‘బీఎంఆర్’

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్

కుల్కచర్ల: బీఎంఆర్ ఫౌండేషన్ పేదలకు అండగా పనిచేస్తోందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుప్పలి వెంకటేశ్, సొసైటీ డైరెక్టర్ కటికె నర్సింలు అన్నారు. మండల కేంద్రానికి చెందిన పోతగళ్ల ప్రకాశ్ అనారోగ్యంతో శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి బీఎంఆర్ ఫౌండేషన్ నుంచి రూ.5వేల సాయం ప్రకటించి స్థానిక నాయకులతో అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొగులయ్య, వినోద్, శ్రీశైలం, వెంకట్రాములు, సత్తయ్య పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా బోధన

పెద్దేముల్: ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కొనసాగుతుందని సర్పంచ్ విజయమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలో బాలిక పాఠశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయమ్మ, ఎంపీటీసీ సభ్యుడు అంబరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటితో పాటుగా మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంబరయ్య,హెచ్‌ఎం మల్లమ్మతో పాటు పంచాయతీ వార్డు సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దేముల్ బస్టాండ్‌లో కంట్రోలర్ ఏర్పాటు

- బస్సులన్నీ బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు
- తాండూరు డీఎం సమత

పెద్దేముల్: నిరుపయోగంగా మారిన పెద్దేముల్ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకువస్తామని తాండూరు ఆర్టీసీ డీఎం సమత అన్నారు. శనివారం ఆమె పెద్దేముల్ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైట్లు, ఫ్యాన్‌లు పనిచేస్తున్నాయా లేదా అని ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరైనా ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కంట్రోలర్‌ను ఏర్పాటు చేసి ప్రతీ బస్సు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట ఆర్టీసీ సిబ్బంది సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



పెద్దేముల్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం సమత

‘ఎక్సైజ్ కార్యాలయాన్ని ధారూరుకు మార్చండి’



ధారూరు శాలివాహన కాలనీలో ఉన్న పాత ఎక్సైజ్ కార్యాలయం

ధారూరు: మండల పరిధిలో ఎక్సైజ్ కార్యాలయం లేకపోవడంతో నాటుసారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని ప్రజాప్రతినిదులు ఆరోపించారు. నిజాం కాలం నుంచి ఎక్సైజ్ కార్యాలయాన్ని ధారూరులోనే కొనసాగిందని గుర్తుచేశారు. గత పదేళ్లుగా కొంతకాలం మర్పల్లిలో, తర్వాత వికారాబాద్‌లో ఏరఆపటు చేశారన్నారు. ఇతర మండలాలకు మార్చడం వల్ల నాటుసారాయి ప్రభావంతో గ్రామాల్లో రాత్రిళ్లు గొడవులు జరుగుతున్నాయన్నారు. వికారాబాద్‌లో ఉన్న ఎక్సైజ్ ఎస్‌ఐ కార్యాలయాన్ని తిరిగి ధారూరులోనే ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎక్సైజ్ కార్యాలయాన్ని ధారూరుకు మార్చితే కల్తీ కల్లుకు, నాటుసారాయికి చెక్ పట్టవచ్చన్నారు.

కంది సాగును ప్రోత్సహించేందుకే..

- ఉచిత విత్తనాల పంపిణీ
- మండల వ్యవసాయ విస్తరణ అధికారి చెన్నయ్య

దోమ: కంది సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తోందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి చెన్నయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని దిర్సంపల్లి గ్రామంలో సర్పంచ్ శాంతారెడ్డితో కలిసి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి సాగుకు బదులుగా కంది సాగు చేసి అధిక లాభాలు ఆర్జించాలన్నారు. క్లస్టర్ల వారీగా కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన వారు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శిరీష, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆంజనేయులు, గ్రామస్తులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న చెన్నయ్య